ఏఐ కారణంగా ఉద్యోగ నష్టాలు.. కల్వకుంట్ల కవిత కీలక సూచనలు 2

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

రిపోర్టర్లు కావలెను

నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 2 | ఏప్రిల్ 3 శుక్రవారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 1.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 2 | PAGES:4 | FRIDAY APRIL 3 2026 | Rs. 1:00

# ఇక అమరావతికి తిరుగులేదు.. రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది: సీఎం చంద్రబాబు

రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి



## అమరావతి బిల్లుపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎన్డీయే ఎంపీలు..



ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలో ఎన్డీయే ఎంపీలతో కలిసి ఆయన ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా ప్రధానికి శాలువా కప్పి, ఏపీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ భేటీ అనంతరం లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ.. "అమరావతి కోసం తమ భూములను త్యాగం చేసి, ఏళ్ల తరబడి నిలబడిన రైతుల అసాధారణ గాథను ప్రధానికి వివరించాను. వారి త్యాగాలను గౌరవిస్తూ, అమరావతిని ప్రపంచ

## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది: ట్రంప్ వ్యాఖ్యలపై ధీటుగా స్పందించిన ఇరాన్




అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

## రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి: హరీశ్ రావు ట్వీట్

కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బిజెపి ప్రభుత్వమే అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు. ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి



## ఇరాన్ యుద్ధం నేపథ్యంలో 'పొరుగుదేశం' దుస్సాహసానికి పాల్పడితే: రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక



పశ్చిమాసియాలో యుద్ధం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో, పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకుని భారత్‌పై అనాలోచిత ఆలోచన చేస్తే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని అన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్షంగా హెచ్చరించారు. పొరుగుదేశం ఉగ్రవాద చర్యలకు గతంలో ధీటుగా బదులిచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడితే ఊహించనిరీతిలో భారత్ స్పందిస్తుందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని కూడా ఆసక్తికర వ్యాఖ్య చేశారు. యూరి దాడి తర్వాత

## ఆ అధికారుల నిర్బంధం తెలియదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ



మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## ఇక అమరావతికి తిరుగులేదు.. రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.

## అమరావతి బిల్లుపై ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎన్డీయే ఎంపీలు..

(మొదటి పేజీ తరువాయి)

స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ఆయన మార్గనిర్దేశం కోరాను" అని పేర్కొన్నారు.అనంతరం లోకేశ్, ఇతర ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిసి బిల్లు ఆమోదానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును కూడా కలిసి అమరావతికి చట్టబద్ధత కల్పించడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలు ఉన్నారు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026 బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లు నేడు రాజ్యసభ ముందుకు రానుంది. ఎగువ సభలోనూ ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకే లోకేశ్ ఢిల్లీ పర్యటనకు వచ్చారు. 2014 నాటి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5ను సవరిస్తూ.. 'కొత్త రాజధాని' అనే పదం స్థానంలో 'అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అని ఈ బిల్లు స్పష్టం చేస్తోంది. తన పర్యటనలో భాగంగా లోకేశ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను కూడా కలవనున్నారు.

## ఇరాన్ యుద్ధం నేపథ్యంలో 'పొరుగుదేశం' దుస్సాహసానికి పాల్పడితే: రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గామ్ దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా స్పందించిందని తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఆ అధికారుల నిర్బంధం తెలియదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ

(మొదటి పేజీ తరువాయి)

తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు.అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు.ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)పై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని మమతా బెనర్జీ అన్నారు. మాల్దాలో జరిగిన అధికారుల నిర్బంధం ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు. తనకు అర్ధరాత్రి సమయంలో ఒక జర్నలిస్టు ద్వారా నిర్బంధం విషయం తెలిసిందని వెల్లడించారు.



## రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి: హరీశ్ రావు ట్వీట్

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది వారి కుట్రకు నిదర్శనమని విమర్శించారు.రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే ఈరోజు కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? అని నిలదీశారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధమో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాలేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం వచ్చేందుకు మీకు దమ్ముందా? అని సవాల్ చేశారు. మీరు క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా? అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీ బిజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా? లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారుఆళేశ్వరం వల్ల ఉపయోగంలేదని కిషన్ రెడ్డి గొంతు చించుకున్నారని ఆరోపించారు. కానీ గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధమా లేక అవివేకమా అని ప్రశ్నించారు.నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' రిపోర్ట్ ప్రకారం, "2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం ఉంది. 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే" అని కుండబద్దలు కొట్టిందని అన్నారు. ఇది కిషన్ రెడ్డి కళ్లకు కనబడటం లేదా అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చెప్పింది మాత్రమే ఆయన చెవుల్లోకి వెళుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి కాదని హితవు పలికారు.కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని మా ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడితే, మీరు దాన్ని సమర్థించకపోగా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది మాత్రం రేవంత్ రెడ్డేనని వ్యాఖ్యానించారు. 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని వినిపించకపోవడం సిగ్గుచేటు హరీశ్ రావు అన్నారు.

## రెండో చోట నామినేషన్ వేసిన విజయ్.. తిరుచ్చిలో పొలిటికల్ హీట్


తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్ తన ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. గురువారం ఆయన తిరుచ్చి తూర్పు నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన అభిమానులతో అక్కడ తీవ్ర కోలాహలం, కొంత గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో ఒక ఊహించని సంఘటన చోటుచేసుకుంది.విజయ్ కాన్వాయ్ నగరం గుండా వెళ్తుండగా, వందలాది మంది అభిమానులు పోలీసుల నియంత్రణను సైతం లెక్కచేయకుండా ఆయన వాహనాన్ని అనుసరించారు. ఈ తోపులాటలో కాన్వాయ్ పక్కన పరిగెడుతున్న ఓ మహిళ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇది గమనించిన విజయ్ వెంటనే తన వాహనాన్ని ఆపి, కిందకు దిగి, గాయపడిన మహిళను వ్యక్తిగతంగా పరామర్శించారు. ఆమె క్షేమంగా ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాతే తన పర్యటనను కొనసాగించారు. ఈ సంఘటనతో అక్కడ కాసేపు ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది.అనంతరం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ముత్తు మురుగేశ పాండియన్‌కు విజయ్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పెరంబలూరులో ఆయన నామినేషన్ దాఖలు చేశారు.నామినేషన్ తర్వాత, విజయ్ దివంగత నేత ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఉందని, అన్ని



కుటుంబాలకు సరఫరా సరిగా అందుతోందా అని ప్రశ్నించారు. ఇతర విషయాల కోసం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సిలిండర్ల సమస్యను పరిష్కరించడానికి ఎందుకు వెళ్లలేదని నిలదీశారు.విలాత్తికులంలో పాఠశాల బాలిక హత్య ఘటనను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. ప్రజలు తమ భద్రతపై భయంతో బతుకుతున్నారని, రాష్ట్రంలో రాజకీయ మార్పు అత్యవసరమని అన్నారు. అధికారంలో ఉన్న 'దుష్ట శక్తులను' ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండు నియోజకవర్గాల్లో పోటీ, ప్రభుత్వాలపై సూటి విమర్శలతో విజయ్ తమిళనాడు ఎన్నికల బరిలో కొత్త వేడిని పుట్టించారు.

## ఏఐ కారణంగా ఉద్యోగ నష్టాలు.. కల్వకుంట్ల కవిత కీలక సూచనలు

కృత్రిమ మేధ (ఏఐ-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కారణంగా చాలామంది ఉద్యోగాలు పోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక సూచన చేశారు. ఏఐ వల్ల జరుగుతున్న ఉద్యోగ నష్టాన్ని అధిగమించడానికి మూడంచెల ఒక ప్రత్యేక చట్టం అత్యవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఒకటి జాతీయ, రాష్ట్రస్థాయి పర్యవేక్షణ యంత్రాంగం, రెండోది సామాజిక రక్షణ, పరిశ్రమ భాగస్వామ్యం మరియు నైపుణ్యాభివద్ధి పెంచడం ద్వారా ఏఐ ఆధారిత ఉద్యోగ నష్టాన్ని అధిగమించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ సూచనలతో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కార్యాలయానికి ట్యాగ్ చేశారు. చేనేత కార్మికుల జీవితాలు అంధకారంలోకి నెట్టేసే కుట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో చేనేతకారుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే కుట్రలు చేస్తోందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ ఆధ్వర్యంలోని యూనిఫామ్‌ల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆర్డర్లపై ఎంతోమంది చేనేత కార్మికులు ఆధారపడ్డారని, ఈ ప్రభుత్వం వారి పొట్ట కొట్టిందని విమర్శించారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇచ్చే రూ.105 కోట్ల విలువైన యూనిఫామ్‌ల ఆర్డర్ ద్వారా వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంటుందని తెలిపారు. కానీ ఈసారి ఆర్డర్ రద్దు చేయడం దారుణమని అన్నారు. సంక్షేమ శాఖలు, ఇతర డిపార్టుమెంట్లకు సంబంధించిన రూ.200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి సంబంధించిన ఆర్డర్‌ను సైతం టెస్కోకు ఇవ్వకపోవడం కార్మికులను సంక్షోభంలోకి నెట్టివేయడమేనని ధ్వజమెత్తారు.గడువు ముగిసినప్పటికీ టెస్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తమకు కావాల్సిన ప్రైవేటు వ్యక్తులకు ఈ ఆర్డర్లను ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చనేత కార్మికులకు అన్యాయం చేసే చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



# సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం





**ఇల్లందలో ఘనంగా పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు**

**వర్ధన్నపేట ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి :**

రాచరికపు వ్యవస్థ నీడలో జమిందార్లు,జాగీర్దారుల అరాచకాలను సహించలేక... మొగలాయిల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని సామాన్య ప్రజల హక్కులను కాపాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని వర్ధన్నపేట ఎస్సై మేరుగు రాజు అన్నారు. గురువారం బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి ని పురస్కరించుకొని వర్ధన్నపేట మండలం ఇల్లంద గౌడ సంఘం అధ్యక్షులు సమ్మట సూరి గౌడ్ , ఉపాధ్యక్షులు, కళ్ళు గీతా కార్మిక సంఘం వరంగల్ జిల్లా గౌరవ సలహాదారులు సట్ల సూరయ్య గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిష్ట్ర ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎస్సై మెరుగు రాజు హాజరై గౌడ సంఘం అధ్యక్షులు సమ్మట సూరి గౌడ్ , ఉపాధ్యక్షులు సట్ల సూరయ్య గౌడ్, పోశాల వెంకన్న గౌడ్, గౌడ సంఘం సభ్యులతో కలిసి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేద, బడుగు బలహీనవర్గాలపై జరిగిన అన్యాయాల పైన విరోచిత పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు.గెరిల్లా పోరాటంతో గోల్కొండ కోటను జయించిన వీరుడు పాపన్నగౌడ్ అని, బహుజనుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని, ఆయన సేవలు చిరస్మరనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు మడ్డి రాజయ్య గౌడ్, సట్ల నరసింహులు గౌడ్, సట్ల లక్ష్మీనారాయణ గౌడ్, సమ్మెట యాకయ్య గౌడ్, పెద్దగోని కవి రాజు గౌడ్, సట్ల సుభాష్ గౌడ్, సట్ల సాయిలు గౌడ్, సమ్మట వెంకటేశ్వర్లు గౌడ్, సమ్మెట శ్రీరాములు గౌడ్,బాలగాని రాజు గౌడ్,బత్తిని రాజ బాబు గౌడ్,సట్ల అనిల్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలు, అవసరాలకనుగుణంగా వారిని అభివృద్ధి పథంలో నడిపేలా నూతన పథకాలను ఏర్పాటు చేస్తూ వారికి ఎంతో ఆర్థిక చేయూత నందిస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి**

తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజల ఆకాంక్షలు, అవసరాలకనుగుణంగా వారిని అభివృద్ధి పథంలో నడిపేలా నూతన పథకాలను ఏర్పాటు చేస్తూ వారికి ఎంతో ఆర్థిక చేయూత నందిస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలియాబాదు, ఎల్లంపేట మున్సిపాలిటిలలోని వార్డు సభలకు మున్సిపల్ ఛైర్మన్లు శిరీషరెడ్డి, శ్రీదేవి లతో కలిసి అదనపు కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా,మహాలక్ష్మి, ఉచిత బస్సుసౌకర్యం, ?500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాల ద్వారా లబ్ది పొందుతున్న వారికి మరిన్ని కొత్త పథకాలను అందించాలనే సంకల్పంతో గ్రామ సభలను నిర్వహించుకుంటున్నామన్నారు. జూన్ 2 నుంచి అందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందించడం, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు, దివ్యాంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి కొత్త పథకాలను మన ప్రభుత్వం ప్రవేశపెడుతుందని అన్నారు. గ్రామ/వార్డు సభలలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపడతామన్నారు.ఈ పథకాల ద్వారా లబ్ది పొందుతున్న వారు,ఈ పథకాల గురించి తెలియని వారికి మీరే ఈ పథకాల గురించి అవగాహన కల్పించి వారు కూడాఈ పథకాలను వినియోగించుకునేలా చూడాలన్నారు. దేశం మొత్తం లో కేవలం తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే మహిళల ప్రయాణం కోసం ఇలాంటి పథకాలు ఉన్నాయని, వీటిని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి ఇంటికి చేరడమే ప్రభుత్వం లక్ష్యమని అందులో భాగంగానే గ్రామ/వార్డు సభలు ఏర్పాటు చేసి మిమ్మల్ని భాగస్వామ్యం చేయడంతో పాటు మీ మీ సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమన్నారు. అంతకు ముందుగా ముఖ్యమంత్రి గారి సందేశాన్ని చదివి వినిపించడం, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి వీడియోలను ప్రదర్శించడంతో పాటు సాంస్కృతిక కళాకారులు సంక్షేమ పథకాల పై పాటలు ఆలపించారు. అనంతరం లబ్దిదారులు వారి సమస్యలను అదనపు కలెక్టరు గారికి తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటున్న లబ్దిదారులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్లు, వైస్ ఛైర్మన్లు, సంబంధిత తహాసీల్దార్లు, నోడల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా కేంద్రానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్ .ఇంద్రసేనారెడ్డి.

**రోడ్లు భవనాల అతిథి గృహం వద్ద స్వాగతం పలికిన అధికారులు, ప్రజాప్రతినిధులు.**

**నల్గొండ ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి**



గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యే నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డికి రోడ్లు, భవనాల అతిథి గృహం వద్ద రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డినల్గొండ



మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి లు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

## వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి**



ఎంతో నమ్మకంగా వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. గురువారం కూకట్పల్లి లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరి తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు అంకితభావంతో పేషంట్లుకు సేవలు అందించాలని, అన్ని వేళలలో వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎంత మంది పేషంట్లు వస్తారని, వారి వివరాలను సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారా అని అడిగి రిజిష్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి కావలసిన మరమ్మత్తులు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డెలివరీ టీమ్స్ వంటి సమస్యలను మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కు తెలుపగా, కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన వాటికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. శానిటేషన్ వారితో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మందుల గదిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ పరిశీలించి మందులు అందించాలని సిబ్బందికి సూచించారు.

## తూతూ మంత్రంగా ప్రజా పాలన వార్డు సభలు

**సమస్యల ప్రణాళికల ఊసే లేదు**

**నల్గొండ ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి**



కాంగ్రెస్ పార్టీ ప్రచార ఆర్భాటం కోసమే ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక వార్డు సభలు తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగము లేదని సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు గురువారం పట్టణంలో జరిగిన వార్డు సభలలో వివిధ డివిజన్ లలో సిపిఎం నాయకులు వార్డు సభలలో పాల్గొని సమస్యలపై దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. 11వ డివిజన్ లో పాల్గొన్న సిపిఎం పట్టణ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య మాట్లాడుతూ 11వ డివిజన్ లో సిసి రోడ్లు నిర్మించిన చోట డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో ఇండ్ల మధ్య దుర్గంధం వ్యాపించి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. అర్బన్ కాలనీ గ్రౌండ్ లో ప్రహరీ గోడ నిర్మించి వాకింగ్ ట్రాకర్ ఏర్పాటు చేయాలని, కతాల్ గూడెం మామిల్లగూడెం లో ఉన్న స్మశాన వాటిక లకు ప్రహరీ గోడ, దహన వాటికలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్వాయి పాపన్న విగ్రహం నుండి మెగాసిటీ, అర్బన్ కాలనీ మీదుగా మామిళ్లగూడెం ఈదమ్మ గుడి వరకు ఉన్న పురాతన నక్ష దారి ఆక్రమణ గురైందని సర్వే చేసి హద్దులు నిర్ణయించి రోడ్డు నిర్మాణం చేయాలని తద్వారా అర్బన్ కాలనీ డ్రైనేజీ వాటర్ పోవడానికి వీలు అవుతుందని సూచించారు. ప్రభుత్వ స్థలాలు గ్రామ కంఠం స్థలాల్లో నిర్మించుకున్న ఇండ్లకు ఓల్డ్ ఆఫ్ ద ప్రాపర్టీ అని ఇంటి యజమాని పేరు లేకుండా ఇంటి నెంబర్ ఇస్తున్న విధానాన్ని మార్పు చేసి ఒక సంవత్సరం ఇంటి టాక్సీ వేసి సాదా బైనామి ల ద్వారా ప్రస్తుత నివాసం ఉంటున్న ఇంటి యజమాని పేరు తో ఇంటి నెంబర్ ఇవ్వాలని కోరారు. అర్బన్ కాలనీ గ్రౌండ్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ కు కు రెగ్యులర్ గా డాక్టర్ వచ్చే విధంగా చూడాలని, ఖాతాల గూడ ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా మార్పు చేయాలని కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలు సొంత డబ్బా కొట్టుకోవడానికి తప్ప ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. సమాభావన సంఘాలకు వడ్డీలోని రుణాలు ఇస్తామని ఎన్నికల హామీ తప్ప అమలుకు దోచుకోలేదని అన్నారు. పావలా వడ్డీ నిధులు మంజూరు చేసి బ్యాంకులో వేశామని సభలలో చెప్తున్నారు కానీ మహిళల ఖాతాలో జమ కాలేదని అన్నారు. 5వ డివిజన్ లో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు అవుట రవీందర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం మహిళా ప్రాంగణంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు 2017 లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని మౌలిక సదుపాయాలు కల్పించి నివాసయోగ్యంగా తయారు చేయాలని కోరారు ఆరు గ్యారెంటీలలో గ్యాస్ 500 కు అమలు కావడం లేదని మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు కల్పించినప్పటికీ బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణంలో వివిధ డివిజన్లో జరిగిన కార్యక్రమాలలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, గాదె నరసింహ, మైల యాదయ్య గుండాల నరేష్, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, గంజి రాజేష్, పనస చంద్రయ్య, రుద్రాక్ష రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# ప్రధాన పత్రికల్లోని ప్రతీ జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్ కార్డ్స్ ఇవ్వాలి.

**మంత్రి కోమటిరెడ్డికి, మండలి చైర్మన్ గుత్తాకు జర్నలిస్టుల వినతిపత్రం.**

**జర్నలిస్టుల అక్రెడిటేషన్ లపై సీయంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తా - మంత్రి కోమటి రెడ్డి.**

**అందరికీ అక్రెడిటేషన్ వచ్చేందుకు కృషి : చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.**

**నల్లగొండ, ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి :**



జిల్లా కేంద్రంతో పాటు, మున్సిపల్ కేంద్రాలలో, డెస్క్ లలో ప్రధాన పత్రికల్లో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని, సీయం రేవంత్ రెడ్డి తో మాట్లాడతామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రధాన పత్రికల జర్నలిస్ట్ లు మంత్రిని, శాసన మండలి చైర్మన్ని వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. జిల్లా, మున్సిపల్ కేంద్రాల్లో పనిచేసే ప్రధాన పత్రికల రిపోర్టర్లకు,, డెస్క్ జర్నలిస్టులకు, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి రిపోర్టర్లకి కొత్త జీవోతో అక్రిడిటేషన్ల రాని పరిస్థితిని ఈ సందర్బంగా మంత్రి, చైర్మన్ కి వెర్బరుగా వివరించారు. గతంలో ఇచ్చిన మాదిరిగానే ఈసారి కూడా ప్రధాన పత్రికల్లో పనిచేసే ప్రతి జర్నలిస్ట్ కి అక్రిడిటేషన్ కార్డ్స్ ఇవ్వలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని సీయం, ఐఅండ్ పీఆర్ కమిషనర్ తో మాట్లాడి సమస్య పరిస్కారానికి కృషి చేస్తానన్నారు. సంభంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు కమిషనర్ తోనూ దీనిపై చర్చించి అక్రిడిటేషన్స్ సమస్య పరిస్కారం కోసం కృషి చేస్తానని మండలి చైర్మన్ గుత్తా సుఖేందరు రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల బ్యూరో ఇంచార్జిలు మర్రి మహేందర్ రెడ్డి, చింతకింద గణేశ్, చల్లా సాంబశివారెడ్డి, ఎడిషన్ ఇంచార్జిలు కల్యాణ నాగేశ్వరరావు, బొడ్డు జనార్దన్ రెడ్డి, సీనియర్ రిపోర్టర్లు పులి మామిడి మహేందర్ రెడ్డి, మీసాల శ్రీనివాస్, గుండాల యాదగిరి, జిన్నా శ్రీనివాస్ రెడ్డి, పోగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రభుత్వ అభివృద్ధి పై అవగాహనతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం.





**రాష్ట్రంలో కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం.**

**నియోజకవర్గానికి 3500 చొప్పున 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయం- రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.**

**నల్గొండ జిల్లా, ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గురువారం నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, ఊరుమడ్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ భాను శ్రీ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్లు హాజరయ్యారు. గ్రామసభలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్దిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత నెల 30న రాష్ట్ర బడ్జెట్ ను ఆమోదించుకున్న విషయం తెలిసిందేనని, రాష్ట్రంలో కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అలాగే నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విడతన ఇదివరకే బేస్మెంట్ వేసుకున్న వారికి, పిల్లర్లు వేసుకున్న వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యాభివృద్ధిలో భాగంగా నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నామని, ఉరుమడ్ల గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సీసీ రహదారులు అన్ని సౌకర్యాలు ఉన్నందున మోడల్ స్కూలును ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశంతో కోరారు . ఉరుమడ్ల గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, రెండు అంగన్వాడీ భవనాలు పూర్తి చేశామని, రెండున్నర కోట్ల రూపాయలతో చెరువును పటిష్టం చేశామని, రెండు కోట్ల రూపాయలతో గ్రామానికి బీటీ రహదారి మంజూరు అయిందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను, సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రానున్న సంవత్సర కాలంలో ప్రజలకు సంబంధించి మిగిలిపోయిన సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. గతంలో గ్రామంలో 11 మంది ఎస్సీలకు భూములు ఇవ్వడం జరిగిందని, అయితే దారిలేనందున ప్రత్యామ్నాయంగా మరో భూమిని కేటాయించడం జరిగిందని త్వరితగతిన మా భూమిని లబ్ధిదారులకు ఇప్పించే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. ప్రభుత్వ విప్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గడచిన 2 సంవత్సరాలుగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సిలిండర్ ,సన్న బియ్యం, తదితర పథకాలను 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఇంకా చాలామంది అర్హులైన వారికి రేషన్ కార్డులు రావాల్సి ఉందని, వాటిని కూడా ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉరుమడ్ల గ్రామంలో చెరువులు, రహదారులు అన్నింటిని అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, ఉరుమడ్ల గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా మార్చి 6న ప్రారంభమైన కార్యక్రమం మార్చి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ జరిగిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ పథకాల కింద లబ్దిదారుల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ,మహిళకు ఉచిత బస్సు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ వంటివి ఇదివరకే ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతన పథకాల లో భాగంగా పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం, అన్ని వర్గాల ప్రజలకు జీవిత బీమా పథకం, దివ్యాంగులకు మోటారు బ్యాటరీ సైకిళ్లు, రైతులకు మేలైన వంగడాలు ఇస్తున్నామని, ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామసభలలో ఆయా పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలన్నిటిని చదివి వినిపించడమే గాక, గ్రామంలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని వెల్లడించారు .అంతకుముందు గ్రామ సర్పంచ్ భానుప్రియ అధ్యక్షతన గ్రామసభ ను ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి ,చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీత, తహసిల్దార్ విజయ, ఎంపీడీవో జయలక్ష్మి, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ ఏప్రిల్ 02 నేటి వెలుగు ప్రతినిధి**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.గురువారం అయన నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రంలో రైతు వేదిక ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .రానున్న మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు,సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తామని, అందుకే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు, తెలంగాణ మోడల్ స్కూల్ లను నిర్మిస్తున్నామని ఈ పాఠశాలల కు విద్యార్థులను తీసుకువెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నామని, నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలతో పాటు, నూతనంగా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నదని, రాష్ట్రంలోని మూడు కోట్ల 15 లక్షల మంది ప్రజలకు లాభం చేకూరేలా దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ పథకం అమలు చేయనుందని, ప్రమాదంలో లేదా జబ్బులతో ఎవరైనా చనిపోతే ఇందిరమ్మ జీవిత బీమా అమలవుతుందని, ఏప్రిల్ ఒకటి నుండి ఈ పథకం ప్రారంభమైనట్లు ఆయన చెప్పారు. అలాగే ఎల్ కె జి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించే కొత్త పథకాన్ని కూడా అమలు చేయనున్నామని, దివ్యంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాలు అందిస్తున్నామని, రైతులు సేంద్రియ వ్యవసాయంతో పాటు, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కోరారు. తిప్పర్తి మండల కేంద్రంలో 60 లక్షలతో సిసి రోడ్లు నిర్మించడం జరిగిందని, మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తున్నామని, 6 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాల మంజూరు చేసామని, 26 కోట్ల రూపాయలతో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి జీవో త్వరలో రానుందని, 15 రోజుల్లో టెండర్లు పిలిచి అన్ని సేవలు అందించేలా పీహెచ్సీ ని తీర్చిదిద్దుతామని, అలాగే కనగల్ లో సైతం పిహెచ్ సి ని మంజూరు చేసినట్లు చెప్పారు. మండలంలో గతంలో 100 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, నిధులు లేనందున మధ్యలో నిర్మాణాలు ఆగిపోయాయని, వాటికి నిధులు మంజూరు చేయిస్తామని, నెల రోజుల్లో గృహప్రవేశాలకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. 100 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహప్రవేశాల కోసం తన సొంతంగా ప్రతి ఇంటికి 20వేల రూపాయలు ఇస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వీటితోపాటు, ఇదివరకే 130 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చామన్నారు.మండలంలో గ్రామ సమాఖ్య భవనాలను నిర్మిస్తున్నామని ,సిసి రోడ్లు, డ్రైనేజీలతో పాటు ,సాగునీరు అందించే కాలువల మరమ్మతులకు మూడున్నర కోట్ల రూపాయలు వెచ్చించి లైనింగ్ చేపట్టామని, మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనం పాతబడిపోయినందున 70 లక్షల రూపాయల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని చూడాల్సిందిగా ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తిప్పర్తి మండలానికి రెండు బస్సులు ఇచ్చేందుకు మంత్రి హామీ ఇచ్చారు. అలాగే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని, మహిళలకు ఇదివరకే వడ్డీ లేని రుణాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మండలం సమాఖ్య ద్వారా 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మహిళా సంఘాలు ముందుకు రాగా, అందుకు వెంటనే మంత్రి స్పందిస్తూ మహిళా సంఘాల చేత మూడు దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు. తిప్పర్తి మండల కేంద్రానికి త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిని తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో 100 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూములు ఇండ్లు ఇవ్వగా గతంలో నిధుల చెల్లింపుతో ఆగిపోయాయని ,మంత్రి ఆదేశంతో తక్కిన నిధులను వెచ్చించి త్వరగా నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవలే మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా 10 వేల కోట్ల రూపాయల మైలురాయిని అధిగమించారని ,మండలంలో 352 కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా సన్న బియ్యం ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరా మహిళ శక్తి ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, రైతులకు రైతు భరోసా నిధులను ఇటీవల ప్రభుత్వం అందించిందని,




నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికంగా సర్పంచుల వ్యవస్థ చాలా ముఖ్యమని అన్నారు. పేద కుటుంబాలకు ,అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ లబ్ధి అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ రజిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.ఈ సందర్భంగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, ఎల్పిజి తదితర పథకాల కింద లబ్ధి పొందిన లబ్ధిదారులు వారు పొందిన లబ్ధిని తెలియజేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.




Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**